


## గణేశ్ పండుగ వేడుకల్లో.. ఆకతాయిల అలజడి

సిటీబ్యూరో, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): గణేశ్ నవరాత్రులు, నిమజ్జనోత్సవంలో షీ టీమ్స్ నిఘాకు 488 మంది పోకిరీలు చిక్కారని, అందులో 122 మందికి జైలు శిక్షలు ఖరారు చేస్తూ న్యాయస్థానం తీర్పు చెప్పిందని హైదరాబాద్ మహిళా సేఫ్టీ డీసీపీ కవిత తెలిపారు. గతనెల 18 నుంచి 28వ తేదీ వరకు జరిగిన గణేశ్ వేడుకలలో బడా గణేశ్, ఎన్టీఆర్ మార్గ్, ట్యాంక్ బండ్, , ఖైరతాబాద్ ప్రాంతాల్లో షీ బృందాలు నిఘా ఏర్పాటు చేయగా.. మహిళలతో చాలా మంది అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వీడియోలకు దొరికిపోయారని తెలిపారు. క్యూ లైన్‌లో ఉన్నవారితో, వేడుకలు వీక్షించేందుకు వచ్చే వారిని రద్దీలో తాకుతూ, ఇష్టానుసారంగా కామెంట్లు చేస్తున్న వారిని (488 మంది) పట్టుకోగా.. అందులో 122 మందిపై పెట్టీ కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు. వారికి 3 రోజుల నుంచి ఆరు రోజుల వరకు శిక్షలు విధిస్తూ న్యాయస్థానం తీర్పు చెప్పిందని వివరించారు. 111 కేసుల్లో వార్నింగ్ ఇచ్చి కౌన్సెలింగ్ నిర్వహించామని, 255 కేసులు కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయన్నారు.




